# ‘రాయలసీమ’ కొనసాగడం నిజమే

- అంగీకరించిన ఎంవోఈఎఫ్ జాయింట్ కమిటీ
- ఎట్టకేలకు గ్రీన్‌ట్రిబ్యునల్‌కు నివేదిక
- అయినప్పటికీ దృష్టిసారించని కాంగ్రెస్ సర్కారు
- లేఖలు రాసి చేతులు దులుపుకొంటున్న దుస్థితి



హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను అడ్డుకోవాల్సిన కేంద్రమే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. అడుగడుగునా వత్తాసు పలుకుతున్నది. ప్రాజెక్టు పనులు కొనసాగేందుకు పరోక్షంగా మద్దతునిస్తున్నది. అందుకు కేంద్ర సంస్థల వ్యవహారశైలి ఊతమిస్తున్నది. ప్రాజెక్టును మార్చి నెలలో సందర్శించి పనులు కొనసాగుతున్నాయని గుర్తించినా ఆ నివేదికను వారం రోజుల కిందటి వరకు ఎన్జీటీకి సమర్పించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అదే నివేదికను సమాచారహక్కు చట్టం కింద కోరితే మాత్రం ఐదునెలల ముందుగానే ఇవ్వడం గమనార్హం. వివరాల్లోకి వెళ్లితే.. ఏపీ ప్రభుత్వం పర్యావరణ అనుమతుల్లేకుండానే రాయలసీమ ప్రాజెక్టును చేపట్టిందని నారాయణపేట జిల్లాకు చెందిన ఒకరు ఎన్జీటీని ఆశ్రయించడం, దీనిపై వాస్తవాలను తేల్చేందుకు ఇప్పటికే కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటవడం, నివేదికను సమర్పించడం తెలిసిందే. ఆ ప్రాజెక్టు పనుల విషయంలో ఏపీ ప్రభుత్వం చెప్తున్న విషయాలన్నీ అబద్ధమేనని ఆ నివేదిక స్పష్టంచేసింది. దీనిని అనుసరించి పర్యావరణ అనుమతులు పొందేవరకూ రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీ కోసం కూడా ఎలాంటి తవ్వకాలు, పనులను చేపట్టవద్దని ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ ఏపీ సర్కారు ఆర్ఎల్ఐఎస్ పనులను కొనసాగించడంతో ఎన్జీటీలో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఎన్జీటీ మరోసారి జాయింట్ కమిటీని నియమించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నివేదికను అందించాలని కేంద్ర పర్యావరణశాఖకు చెందిన సైంటిస్టుతోపాటు, మరో ఇద్దరు సభ్యులను కూడా నియమించింది. ఆ కమిటీ ఈ ఏడాది మార్చి నెలలోనే ప్రాజెక్టును సందర్శించింది. అందుకు సంబంధించిన నివేదికను సైతం జూలైలోనే సిద్ధం చేసింది. కానీ. ఎన్జీటీకి ఇవ్వకుండా తాత్సారం చేస్తూ వచ్చింది. మరోవైపు తెలంగాణకు చెందిన ఒకరు కేంద్ర పర్యావరణశాఖకు ఇదే విషయమై ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే మాత్రం అందుకు సంబంధించిన నివేదికను ఇచ్చింది. ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని జాయింట్ కమిటీ రిపోర్టు కూడా స్పష్టం చేయడం గమనార్హం. మొత్తంగా ఏపీ కొనసాగిస్తున్న పనులకు కేంద్రమే పరోక్షంగా మద్దతు ఇస్తున్నదని తేలిపోతున్నది. ఇదిలా ఉంటే, ఏపీ ప్రభుత్వం ఆర్ఎల్ఐఎస్ పనులను కొనసాగిస్తున్నదని గత డిసెంబర్‌లోనే ఆధారాలతో సహా పలువురు బయటపెట్టారు. ఆ వెంటనే హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తరువాత ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని కోరుతూ కంటితుడుపుగా కేంద్రానికి, కేఆర్ఎంబీకి లేఖలు రాసి చేతులు దులుపుకున్నది. కానీ ప్రాజెక్టు పనులు నిలిపివేయించేలా ఏనాడూ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చిన దాఖలాల్లేవు.



## బతుకమ్మ చీరల పంపిణీ

- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో..
- రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో మాత్రమే చీరల పింపిణీకి ఏర్పాట్లు

ములుగు, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రంలోని ఆరు జిల్లాల మహిళా సంఘాల సభ్యులకు బతుకమ్మ చీరలను కానుకగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల్లో నమోదైన 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకూ బతుకమ్మ చీరలు అందించగా.. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచుల చీరల పంపిణీ పేరుతో నూతన పథకాన్ని రూపొందించింది. రాష్ట్రంలో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాతోపాటు గిరిజన జిల్లాలైన మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతోపాటు 18 ఏండ్లు నిండిన గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు ఆయా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాకు 1,77,745 చీరలు చేరా యి. నేటి నుంచి తెలంగాణ ఆడపడుచుల చీరలను మహిళా సంఘాల ద్వారా ఎంపిక చేసిన సభ్యులకు అందించనున్నారు.

## అమెరికా పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం దుబాయ్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఐఎంఈఎక్స్ అమెరికా -2024 పేరిట లాస్ వెగాస్‌లో నిర్వహించనున్న అతి పెద్ద వాణిజ్య ప్రదర్శనలో ఆయన పాల్గొంటారు. సోమవారం వాషింగ్టన్ డీసీ చేరుకొని 8న లాస్ ఏంజెల్స్, 9,10 తేదీల్లో లాస్‌వెగాస్, 11న అట్లాంటాలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని 12న భా రత్ చేరుకొంటారు. ప్రపంచ సమావేశాలు, ఈవెంట్‌లు, ప్రోత్సాహక ప్ర యాణాల కోసం నిర్వహించే వాణిజ్య ప్రదర్శనలో అమెరికా, భారత్, కెనడా, మెక్సికో, బ్రెజిల్, దుబాయ్ సహా పలు దేశాలు పాల్గొంటున్నాయి.

# రోజుకు 3టీఎంసీలు

- రాయలసీమ ఎత్తిపోతలతో భారీ జలదోపిడీ
- ఏకంగా 12 సొరంగాలతో పంప్‌హౌస్
- కృష్ణానదిలో 18 కిలోమీటర్ల కాలువ
- మొత్తం 111 టీఎంసీల తరలింపే టార్గెట్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న జలవనరుల నిపుణులు
- జలదోపిడీపై సీఎం మౌనం వీడాలి: మాజీ ఎమ్మెల్యే బీరం డిమాండ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుతో ఏపీ ప్రభుత్వం భారీ జలదోపిడీకి సిద్ధమయ్యింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 885 అడుగులు కాగా.. 854 అడుగుల వద్ద వరకు మాత్రమే నీటిని తీసుకునే అవకాశం ఉన్నది. ఏపీ ప్రభుత్వం ఏకంగా 800 అడుగుల డెడ్ స్టోరేజీ వరకు నీటిని తోడేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపడుతున్నది. దీనికోసం ఏకంగా 111 టీఎంసీలను తరలించేందుకు 18 కిలోమీటర్లు కృష్ణానదిలో అప్రోచ్ కెనాల్ తవ్వి భారీ ఎత్తున జలదోపిడీకి పాల్పడుతున్నది. ఎన్జీటీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎత్తిపోతల నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో ప్రారంభమైతే శ్రీశైలం జలాశయంలో ఎండాకాలంలో డెడ్ స్టోరేజీలో కూడా నీరు కనిపించని పరిస్థితి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఏపీ చేపడుతున్న భారీ కాల్వ నిర్మాణమే సాక్ష్యం అని అంటున్నారు. గ్రావిటీ ద్వారా అప్రోచ్ కెనాల్ తవ్వి 12 సొరంగాల ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని తరలించి.. అక్కడి నుంచి రాయలసీమకు తరలిస్తారు.

**అటు సస్యశ్యామలం.. ఇటు నీటికి కటకట..**

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు ఎక్కువ భాగంలో ఉండడంతో ఏపీకి కలిసివచ్చింది. కేవలం కాల్వ తవ్వితే చాలు గ్రావిటీ ద్వారా నీటిని తరలించుకుపోవచ్చు. తెలంగాణ వైపు నీటిని మళ్లించాలంటే ఎత్తిపోతలే శరణ్యం. కృష్ణా ప్రాజెక్టులను పరుగులు పెట్టించాల్సిన కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉండి మౌనంగా ఉండటంపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తున్నారు.

> **జలదోపిడీపై సమాధానం చెప్పాలి**
>
> 
>
> ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి, మంత్రులుగా ఉన్నవారు జలదోపిడీపై మౌనం వీడాలి. బేషజాలకు పోకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరందించాలి.కేసీఆర్ హయాంలో తెలంగాణలో ప్రతి బీడు పొలానికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా నదిలో తెలంగాణ రావాల్సిన నీటి వాటాను పక్క రాష్ట్రానికి అప్పజెప్పినట్లుంది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపకపోతే దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉన్నది.
>
> **-బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే**

## 10 నెలల్లో 24వ సారి ఢిల్లీకి

- మళ్లీ హస్తినకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్ర హోం శాఖ సమావేశంతో పాటు కాంగ్రెస్ పెద్దలతో భేటీకోసం పయనం
- మంత్రివర్గ విస్తరణపై చర్చకు అవకాశం
- ఆశావహుల ఎదురుచూపులు ఫలించేనా?



హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ ఢిల్లీ బాట పట్టారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఆయన సీఎం అయిన తర్వాత ఢిల్లీకి వెళ్లడం ఇది 24వ సారి కావడం గమనార్హం. ఈ పర్యటనలో అన్ని రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హోంశాఖ నిర్వహించే సమావేశంలో పాల్గొననున్నారు. ఆ తర్వాత పార్టీ పెద్దలను కలిసే అవకాశం ఉన్నది. పేరుకు కేంద్ర హోం శాఖ సమావేశమని, కానీ మంత్రివర్గ విస్తరణపై చర్చించడమే సీఎం ఢిల్లీ పర్యటన ప్రధాన ఎజెండా అని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గ విస్తరణ అంశం ఈసారైనా కొలిక్కివస్తుందో? లేదో?నని సందేహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తయినా ఇప్పటి వరకు పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు చేయకపోవడంపై పార్టీలో అసంతృప్తి తారస్థాయికి చేరినట్టు తెలిసింది. మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న వారు అధిష్ఠానం తీరుపై గుర్రుగా ఉన్నారు. సీఎం రేవంత్ మొన్నటి ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగ్గా.. హర్యానా ఎన్నికల తర్వాత చూద్దామంటూ అధిష్ఠానం చెప్పినట్టు తెలిసింది. దసరా, హర్యానా ఎన్నికల తర్వాత చర్చిద్దామంటూ పెద్దలు చెప్పడంతో సీఎం ఢిల్లీకి వెళ్లినట్టు సమాచారం. దసరా కానుకగా మంత్రివర్గ విస్తరణ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. ఇక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడంతో మంత్రి పదవుల ఆశావాహులు, వారిని బలపరుస్తున్న పలువురు మంత్రులు సైతం ఢిల్లీ బాట పట్టినట్టు తెలిసింది.

# ఉగ్రవాది కాదు..నేరగాడు కాదు!

- సోషల్ మీడియాలో స్పందిస్తే జైలేనా?
- సీవీ ఆనంద్ సమాధానం చెప్పండి
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. ‘అతడు ఉగ్రవాది కాదు.. నేరగాడు అసలే కాదు.. హైడ్రా బుల్డోజర్, మూసీ బాధితుల ఆక్రందనలు, కన్నీటి వేదనను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిని జైల్లో వేశారని విమర్శించారు. అతడి ఫొటోను కాంగ్రెస్ ఐటీ సెల్‌కు పోలీస్ విభాగం ఎలా పంపిందని ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఇది ఆ వ్యక్తి హక్కుల ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. దీనిపై హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడి ఫొటోతోపాటు ‘హద్దు మీరితే తప్పదు శిక్షలు. ప్రశ్నించేతత్వాన్ని దు ర్వినియోగం చేస్తున్న పోరంబోకులు’ అని కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టు చేయడాన్ని క్రిశాంక్ ఖండించారు.





నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


## ‘గోపా’ రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకారం

**హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు**

ఖైరతాబాద్, అక్టోబర్ 6: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా)ను జిల్లా స్థాయిలో అభివృద్ధి చేసి పేద విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రులు కోరారు. రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి సాయన్నగౌడ్, జీవీ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్‌తోపాటు ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, బూర నర్సయ్యగౌడ్, విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీలు రాజలింగంగౌడ్, గంగాధర్ గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు కే సత్యనారాయణ గౌడ్, కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా బడ్జెట్ పెంచాలని సర్కారును నిలదీద్దాం

- విద్యకు కేటాయింపుల్లో అట్టడుగున మనమే
- విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యకు బడ్జెట్ పెంపుపై అందరం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీద్దామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. విద్యాపరమైన అంశాలపై మాట్లాడేందుకు తనకేం భయం, మొహమాటం లేదని, ఇంత తెలిశాక భయపడటం దేనికని కుండబద్దలు కొట్టారు. హైదరాబాద్ అబిడ్స్ మెథడిస్ట్ కాలేజీలో ఆదివారం జరిగిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కేవలం 7.4 శాతం నిధులను కేటాయించడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో పెట్టినట్టుగా 15 శాతం నిధులు కేటాయించాల్సిందేనని, బడ్జెట్‌ను పెంచాల్సిందేనని, లేకపోతే భారీ తప్పిదమవుతుందని హెచ్చరించారు. దేశంలో విద్యకు సింగిల్ డిజిట్ శాతం బడ్జెట్ ఇచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా 100 మంది ఆడపిల్లలు ఒక్క టాయిలెట్ ముందు క్యూకట్టడం నాన్సెన్స్ అని వ్యాఖ్యానించారు. సాక్షాత్తు ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ చైర్మన్ హోదాలో ఉండి ఇలా వ్యాఖ్యానించడం ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టినట్టయింది.

## గ్రంథాలయ సంస్థలకు చైర్మన్ల నియామకం

**జీవోలు జారీ చేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి**

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లా గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నూతన చైర్మన్లను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వేర్వేరు జీవోలను విడుదల చేశారు.

| జిల్లాపేరు | కొత్త చైర్మన్ | జిల్లాపేరు | కొత్త చైర్మన్ |
|---|---|---|---|
| జోగులాంబ గద్వాల | నీలి శ్రీనివాసులు | సంగారెడ్డి | గొల్ల అంజయ్య |
| మహబూబ్‌నగర్ | మల్లు నర్సింహారెడ్డి | వనపర్తి | జీ గోవర్ధన్ |
| వికారాబాద్ | శేరి రాజేశ్ రెడ్డి | రంగారెడ్డి | ఏ మధుసూదన్‌రెడ్డి |
| నారాయణపేట | వరాల విజయ్‌కుమార్ | కరీంనగర్ | సత్తు మల్లయ్య |
| కామారెడ్డి | మద్ది చంద్రకాంత్‌రెడ్డి | రాజన్న సిరిసిల్ల | నాగుల సత్యనారాయణగౌడ్ |
| | | నిర్మల్ | సయ్యద్ అర్జుమంద్ అలీ |

## నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం

- గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకం
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల సమావేశంలో పొంగులేటి



హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం-24(ఆర్వోఆర్ యాక్ట్)ను అమల్లోకి తేనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ ఉద్యోగుల జాబ్ చార్టుల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి సమావేశమమై మాట్లాడారు. 33 జిల్లాలకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తామని, ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి బదిలీ చేస్తామన్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆఫీసులు నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో 3.50 లక్షల ధరణి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. దసరాలోగా ఎన్నికల తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పారు. రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## 5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

- దసరా ముందురోజు భూమి పూజ
- డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ సంవత్సరం 5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దసరాకు ముందు రోజు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ మానవ వనరులు ప్రపంచంతో పోటీపడేలా విద్యపై దృష్టి పెడతామని చెప్పారు. 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూళ్లను నిర్మించి ఇక్కడ 12వ తరగతి వరకు విద్యార్థులకు బోధిస్తామని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని భట్టి ఆదివారం సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని, ఇప్పటివరకు 25 నియోజకవర్గాల నుంచి స్థలాలను సేకరించి పైలట్ ప్రాజెక్టు కింద కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,023 రెసిడెన్షియల్ పాఠశాలు, ఉండగా ఇందులో 662 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. అన్నివర్గాల విద్యార్థులు కలిసి ఒక చోట ఓ కుటుంబంలా చదువుకొనేలా స్కూళ్ల భవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు





